

# మూడో సీతకథ

బ్రాహ్మణ పిల్ల

– భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

***రెండో సీత పెళ్ళికూతురాయెనే!***

"ఒసేయ్ సీతా.. నాకు పెళ్ళే.! పెళ్ళికొడుకు ఎంత బాగుంటాడో తెల్సా?" రెండో సీత మా యింటి కొచ్చి మరీ సంబరంగా అన్నది. దాని మొహం చూస్తే వెన్నెల్లో కలువలాగా వెలిగిపోతోంది.

అసలీ మధ్య లైబ్రరీ ధ్యాసలోపడి అన్నీ మర్చిపోయా. 'పాతబడి బేచ్'కూడా కాస్త దొంగతనాలూ అవీ ఇవీ చేస్తూ నన్ను లాగటానికి ట్రై చేశారుగానీ, నేను లొంగలా.

వాళ్ళనికూడా, "లైబ్రరీకి రండిరా. బోలెడన్ని పుస్తకాలూ కథలూ రెడీగా ఉన్నాయి!" అని ఊరించినా, స్కూలు వుండేప్పుడే చదవటానికి బధ్ధకించేవాళ్ళు శలవుల్లో ఏం చదువుతారూ? దాంతో వాళ్ళూ బాగా 'డల్' అయిపోయి, "నువ్వు మారిపోయావే సీతా. పుస్తకాల పురుగువయ్యావు!" అన్నారు. మా లైబ్రేరియన్ ఆచార్యులుగారు, 'బాలభారతం' పుస్తకం నాకు ఇస్తూ, "విజ్‌డమ్ యీజ్ వెల్త్... నాలెడ్జ్ యీజ్ వెల్త్" అని వివరించారు.. దాని అర్థాన్ని.

"స్నేహితులారా, విజ్ఞానమే మీ ఆస్తి.. తెలుసుకోండి. మనం చదవబోయేది థర్డ్ ఫారం. స్కూలు తెరిచేముందే, ఎన్ని పుస్తకాలు చదివితే అంత భాగ్యం!" అన్నాను.

"పోవే! చదివీ చదివీ కళ్ళు వాచి కళ్ళజోళ్ళొస్తై. ఆ భాగ్యమేదో నువ్వే సంపాయించుకో. అవసరం వచ్చినప్పుడు మాకూ పంచుదువుగాని!" అంటూ చక్కాబోయారు.

"అవునే.. పెళ్ళికొడుకుని చూశావా?" అనడిగాను.

"ఫోటో చూశానే."

(ఆ రోజుల్లో పెళ్ళికొడుకు ఫోటోని పెళ్ళికూతురికి చూపించడమే పే...ద్ద రివల్యూషన్.!) మొహం 'అంత'చేసుకుంది. "మా ఇంటికిరావే!" అంటూ నన్ను వాళ్ళింటికి లాక్కెళ్ళింది. దాని పెళ్ళికోసం కొన్న చీరలూ, నగలూ, స్టీలు సామానూ ఒక్కొక్కటీ చూపిస్తూ వాటి ఖరీదులు కూడా చెప్పి మహా మురుసుకుంది. ఎందుకో దాన్ని చూస్తే మహా జాలేసింది.

"నువ్వెట్టా బతుకుతావే పిచ్చిదానా?" అన్నాను ఆరిందాలాగా. అది నిర్ఘాంతపోయి నా వంక చూసింది. కానీ ఓ నిముషం తరువాత మళ్ళీ తేరుకుని, "పెళ్ళికొడుకు 'టక్' చేసుకున్నాట్టే.! మహా ఠీవిగా వున్నాడని మా పిన్ని అన్నది!" అంటూ వర్ణన మళ్ళీ మొదలెట్టింది. దీన్నెవడు బాగుచెయ్యగలడూ? దాన్ని వదిలించుకుని మా ఇంటికొచ్చేటప్పటికి మధ్యాహ్నం రెండు గంటలైంది.

"పదిరోజుల్లో దాని పెళ్ళిట.! ఇప్పట్నించీ చూస్తేగానీ మన 'శంఖిణి'కి మంచి సంబంధాలు దొరకవు!" ఇంట్లో అడుగుపెడుతూనే మా అమ్మ మా నాన్నతో అనే మాట విన్నాను. చిర్రెత్తుకురాదూ?

"ఇదిగో భాగ్యలక్ష్మీ, బాగా గుర్తుంచుకో. ఈ సీత లాయర్ అయ్యేదాకా ఏడ్చిమొత్తుకున్నా పెళ్ళిచేసుకోదు. అనవసరంగా మా నాన్నకి పురెక్కించకు. లాయరయ్యాక కూడా నా ఇష్టం వచ్చినవాడ్నే చేసుకుంటాగానీ, ఎవడ్ని బడితే వాడ్నికాదు!" గంభీరంగా, స్వరం బాగా ఎక్కించి ఆవిడ బుర్రలో నా మాటలు 'నాటు'కునేటట్లు అన్నాను.

"చూశారా! ఇది ఎవడితోనే 'చెక్కేసే' రకమేగానీ, మామూల్దిగాదు!" కొరకొరా నావంక చూస్తూ అన్నది మా అమ్మ.

"అబ్బా.! ఊరుకోవే, ముందరరదానికి అన్నం పెట్టు!" చికాగ్గా అన్నాడు మా నాన్న.

*"నంది వాహనం నాట్యం చేసే.!"*

రెండో సీతా వాళ్ళ నాన్నగారు, మా ఊరి దగ్గర్లో వుండే 'పెంచలగూడెం' కరణంగారు. చక్కగా మాట్లాడతారుగానీ, కోపం వస్తే నత్తివొస్తుంది. వాళ్ళమ్మ పాపం మంచిదేగానీ, నన్ను చూస్తే మాత్రం ఆవిడకి కోపం.. నోటికొచ్చినట్టు మాట్లాడతానని. రెండో సీత అన్నయ్యా వొదినా గుడివాడలో ఉంటున్నారు. అతనికి ఏదో ఉద్యోగం. కాస్త పొలం పుట్రా ఆస్తీ ఉన్న వాళ్ళే. ఓ రకంగా వాళ్ళు మాకు బంధువులేట. పిల్లవాడి తరఫువాళ్ళు కబురు తెచ్చారు.. పెళ్ళి మా ఊరు దగ్గర్లో వున్న సీతారామపురంలో జరిపించాలని. వాళ్ళకేదో మొక్కుందట.

అందుకోసం ఇటు ఆడపెళ్ళి వారికీ, అటు మొగపెళ్ళివారికీ కూడా 'విడిదులు' సీతారాంపురంలో ఏర్పాటు చేశారు. కరణంగారు తల్చుకుంటే కానిపని ఏముంటుందీ! ఆ వూరు మా వూరికి దగ్గరే, అంటే గంటలో సైకిల్ మీద వెళ్ళొచ్చుగాబట్టి నేనో రెండ్రోజుల ముందరే సైకిల్ వేసుకుని 'సర్వే' చేసొచ్చా.

పేద్ద పేద్ద తాటాకుపాకలు వేయించారు. ఆ పాకల్లోపల ఇసుకా ఎర్రమన్నూ కలిపి, చక్కగా పరిపించి, నీళ్ళు బాగా జల్లించి, కొంచెం ఆరిన తరవాత 'దిమ్మిస' కొట్టించారు. ఆడవాళ్ళకి అయిదు స్నానాల దొడ్లూ, అయిదు మరుగుదొడ్లూ తడికెలతో 'బందోబస్త్'గా కట్టించారు. కొంచెం దూరంగా మగవాళ్ళకి స్నానాల దొడ్లూ మరుగుదొడ్లూ తడికెలతో ఏర్పాటు చేశారు.

పెద్ద పెద్ద బానలనిండా బాలువారిగూడెం చెరువు నీళ్ళు తెప్పించి మంచినీళ్ళు సిద్ధంగా ఉంచారు. స్నానాలకి నీళ్ళు సీతారాంపురం చెరువులోవే. ఆ రోజుల్లో ఎవరి పెళ్ళికి వెళ్ళినా, ఎవరి గ్లాసూ చెంబూ వాళ్ళు తీసుకెళ్ళాల్సిందే అలాగే తువాళ్ళూ దుప్పట్లూ కూడా. బానలూ గుండిగలూ ఊళ్ళో వాళ్ళే (అంటే అవి వున్నవాళ్ళు) పెళ్ళివారికిచ్చేవారు, వాడకానికి. పెళ్ళయ్యాక వాటిని తోమించి, కడిగించి తిరిగివ్వాలన్నమాట. పెళ్ళిపాకలూ పందిళ్ళూ అవన్నీ 'రామాలయం' దగ్గరగానే వేయించారు. ఓహ్.. వాటన్నిటికీ మామిడాకుల తోరణాలు కట్టిస్తారుట.. పెళ్ళిరోజున - పెళ్ళిపందిరి చాలా పెద్దగా వేయించారు. చుట్టూ తడికలు కట్టిన ఆ పందిరీ, విడిది పాకలూ కూడా చాలా చల్లగా, కొత్త తాటాకుల సువాసనతో ఘుమఘుమలాడుతున్నాయి. వంటవాళ్ళని రాజమండ్రినించి ప్రత్యేకంగా ఓ రోజు ముందు పిలిపిస్తారుట. పేద్ద పెద్ద గాడిపొయ్యిల్ని తవ్వించి వంటకి సిద్ధంగా వుంచారు. వంట సామాన్ల కోసం గాడిపొయ్యికి పదిగజాల దూరంలో ఓ షెడ్డులాంటిది రేకుల్తో కట్టించారు... వర్షం వచ్చినా తడిసిపోకుండా.

దాన్లోకి పోయి చూశా.! ఏడెనిమిది కత్తిపీటలూ, కూరలు కడగటానికి రేకు బక్కెట్లూ, చాకులూ పెద్ద పెద్ద సత్తు పళ్ళాలూ, కూరగుత్తులూ, బోలెడు గరిటలూ రెడీగా వున్నాయి.

రేపు పెళ్ళనగా ఇవాళ మంచి ముహూర్తం చూసుకుని అందరం బయలుదేరాం. మా వూరి శివాలయం నించి బయలుదేరటానికి ఎద్దుబళ్ళని కరణంగారు పురమాయించారు. బళ్ళకి 'గూడు' కట్టి, గడ్డివేసి, దానిమీద కొత్త యీతాకు చాపలు పరిచి ఆడవాళ్ళకోసం సిద్ధంగా వుంచారు.

ఎక్కి కూచుంటే వుందీ.! ఏం మజా! మొత్తం ఏభై ఎనిమిది బళ్ళు. ఎద్దుల మెడలో గంటలు గణగణలాడుతుంటే, బళ్ళదారిలో గతుకులకి అప్పుడప్పుడూ మేం ఎగిరెగిరిపడుతుంటే, కాడికి కట్టిన పూలమాలలు సువాసన వెదజల్లుతుంటే, ఆ కాస్త ప్రయాణం ఎంత అద్భుతంగా సాగిందో ఏమని వివరించనూ!

మా అమ్మ వద్దన్నా వినకండా ఓ ఇత్తడి బిందెనిండా మడినీళ్ళు పట్టుకొచ్చింది. బండి కుదుపులకి అవి చింది మా అమ్మ చీర 'సుప్తా'గా తడిసిపోయింది. మా నాన్న ఒకటే నవ్వు. తీరా బండి దిగాక చూస్తే అయిదో వంతు నీళ్ళు కూడా లేవుగదా, నా గౌనూ మా నాన్న పంచాకూడా తడిసి ముద్దయ్యాయి.

"ఎట్టాదిగేదే సీతా.. యీ తడి చీరతో!" మా అమ్మ విచారంగా అంది. బండి వాడ్ని దూరంగా పొమ్మని నేనూ మా నాన్నా ఓ చీరని విప్పదీసి తెరలా పట్టుకు నిలబడ్డాం. ఆవిడ నడుస్తుండగా ఘోషా చీరెతో మేమూ వెనకాలే నడిచి విడిది పాకలో దింపాం. అప్పటికిగానీ ఆవిడ బాధ తగ్గలా.

బయటకొచ్చాక నవ్వే నవ్వు. ఎందుకంటే మా వీధిలో వుండే ఏలేశ్వరపు వాళ్ళు మడితో 'ఆవకాయజాడీ' తెచ్చారుట. అది వొలికి, ఏలేశ్వరపు వారి అత్తాకోడళ్ళిద్దరూ ఎర్రని కొత్తావకాయతో తడిసి 'మంట'కి తట్టుకోలేక లబోదిబోమని నూనె కారుతుండగా నాట్యం మొదలెట్టారు. మేం నవ్వేది తన గురించేనని మా అమ్మ అనుకుని, చీర మార్చుకుని మమ్మల్ని తిట్టడానికొచ్చి, ఏలేశ్వరపు వాళ్ళ నృత్యం చూసి తెగ నవ్వేసింది. ఒకడి బాధ మరొకడికెప్పుడూ సరదానే కలిగిస్తుంది కదా!

ఆడపెళ్ళివారికి కేటాయించిన పాకవేరు. ఆడపెళ్ళివారి తరపున వచ్చిన వాళ్ళకి సిద్ధం చేసిన పాకవేరు. ఆ పాకలోకి వెళ్ళగానే నిమ్మకాయ షర్బత్ సిద్ధంగా వుంది. గ్లాసులు మా దగ్గర సిద్ధంగానే వున్నై గనక కరణంగారి చెల్లెలు అక్కగారు బహు మర్యాదగా చక్కని స్టీలు చెంబుతో మా గ్లాసులనిండా షర్బత్ పోశారు.

పాకనిండా చక్కగా వరుసల్లో రంగురంగుల తుంగచాపలు పరిచివున్నై. వంట వాళ్ళూ వడ్డించేవాళ్ళూ కూడా నియోగి బ్రాహ్మలేట. (బ్రాహ్మల్లోనే నియోగులూ, వైదీకులూ ప్రథమశాఖలూ, లింగధారులూ, వైష్ణవులూ, గోల్కొండ వ్యాపారులూ, ఇంకా ములికి నాటవారూ ఇలా చాలా తెగలున్నాయని తరవాత తెలిసింది. అప్పటిదాకా నాకు తెలీనే తెలీదు.)

అయ్యా, ఇక యీ పెళ్ళి ఘట్టం చాలా అద్భుతంగానూ ఉత్సాహవంతంగానూ వుంటుంది. షర్బత్ తాగిన ఓ అరగంటకల్లా "వరపూజకి పోవాలి రండి!" అంటూ రెండో సీతావాళ్ళ పిన్నిగారొచ్చి మమ్మల్ని ఆహ్వానించింది. యీ లోపులోనే ఆడవాళ్ళు చీరలు మార్చేసుకుని నగలు పెట్టేసుకుని, తలలు దువ్వేసుకుని, మా కుర్రగ్యాంగుకీ పట్టుపరికిణీలూ జాకెట్లూ తొడిగించి ముస్తాబు చేశారు.

కరణంగారు 'పానకం' కావిడి మోయించుకుంటూ ముందు నడిస్తే మేమందరం వెనకాల గుంపుగా నడుచుకుంటూ దగ్గర్లోనే మగపెళ్ళివారు 'వేంచేసిన' మామిడితోటలోకి వెళ్ళాం. అక్కడ ఆల్‌రెడీ చాపలూ పెద్దవాళ్ళకి కుర్చీలూ బెంచీలూ (స్కూలువి) పరిచివున్నై.

కరణంగారూ వాళ్ళావిడా పెళ్ళికొడుకునీ పెళ్ళికొడుకు తల్లిదండ్రుల్ని బంధువుల్నీ గౌరవించి, పూలతో పూజించి, కావడిలోని బిందెల్ని వారికి ఇచ్చారు.

"ఇంకాస్త పెద్ద బిందెలైతే బాగుండేది!" కొద్దిగా సణిగింది పెళ్ళికొడుకు తల్లి "అదేంటి వొదినగారూ, యీ బిందెల్ని రాజమండ్రి నించి తెప్పించాం. అన్నిటికంటే పెద్ద సైజువి ఇవే అని మా వారన్నారు!" అన్నది కరణంగారి భార్య.

"ఫరవాలేదులేవే., బిందెలకేంగానీ, మిగతావన్నీ ఘనంగా జరిపిస్తారులే!" లౌక్యంగా అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

నేను పెళ్ళికొడుకువంక చూశా. చాలా అందంగా వున్నాడు. సీత చెప్పింది నిజమే. ఎత్తుకి తగిన లావు.. నవ్వు మొహం. చాలా హుందాగా కూడా వున్నాడు. నన్ను చూసి, "నీ పేరేంటి పాపా?" అన్నాడు.

"సీత" అని చెప్పి ఇవతలకి పరిగెత్తుకొచ్చా. పెళ్ళంటూ చేసుకుంటే ఇలాంటి వాడ్నే చేసుకోవాలని ఆ క్షణంలోనే నిర్ణయించుకున్నాను.

నేను 'పెళ్ళిచేసుకోను' అని మా అమ్మ దగ్గర చేసిన 'భీష్మ ప్రతిజ్ఞ'ని మర్చిపోయి, నేను నిర్ణయించుకున్న మాటే మా అమ్మతో అన్నాను. ఆవిడ పకపకా నవ్వి అందరితోటీ ఆ మాట చెప్పింది. ఆడాళ్ళంతా నవ్వులే నవ్వులు. నన్ను చూడగానే ఆ పూటంతా జనాలు నవ్వటం నాకు మహా చికాకుపుట్టించింది. ఆ తరవాత మా అమ్మకి యీ విషయంలో మా నాన్న 'ప్రయివేటు' చెప్పాడనుకుంటా.. మొత్తానికి సద్దుమణిగింది.

ఇహ వంటలున్నాయీ... ఓహ్.. రంగూ రుచీ వాసనా అద్భుతం. ముఖ్యంగా శనగపొడి వేసిన బీరకాయకూరా, ఇంగువ పోపుతో పరిమళించిన మామిడికాయ పప్పూ, అల్లం పచ్చిమిర్చీ దంచి నిమ్మకాయపిండిన అరిటికాయ 'ఉప్మా' కూర, ఇహ ముక్కల పులుసైతే ఇంతంత గుమ్మడి ముక్కలతో పిచ్చెక్కించేసింది. బిళ్ళలు బిళ్ళలుగా వేసిన గడ్డ పెరుగుని వేడివేడి అన్నంలో కలుపుకుని ఎర్రని కొత్తావకాయని బద్దతో సహా నంజుకు తింటుంటే వచ్చే ఆ యొక్క ఆనందం ఎలా చెప్పనూ!

బూరెల మధ్యలో చూపుడువేలుతో చిల్లుపెట్టి, దానినిండా ఘుమఘుమలాడే నెయ్యిని నింపి అలా నోట్లోకి పంపిస్తుంటే వచ్చే మజా అనుభవిస్తే గానీ తెలీదుగదా!

"ఒసేయ్ సీతా.. నేనివ్వాళ పన్నెండు బూరెలు తిన్నానే!" గొప్పగా అన్నది ఏలేశ్వరపు వాళ్ళ మనవరాలు.

"నాకు నీలాగా తిండి రంధిలేదే! బతకడానికి తినాలిగానీ తినడం కోసం బతగ్గూడదే! అందుకే ఓ పదమూడున్నర బూరెలు మాత్రం తిని వూరుకున్నా.!" అన్నాను. అంతేగా మరీ! మితాహారం వొంటికి మంచిది కూడానూ! అలా అనటం ఇలా చాపమీదకి వొరగటం, సాయంత్రందాకా మెలుకువొస్తే ఒట్టు.!

మర్రోజు మంగళస్నానాలు. పొద్దున్న టిఫిను పూరీలూ.. ఉప్మా.

"నాన్నా.! అమ్మ చేసే బొంబాయిరవ్వ 'ఉప్మా' తిరుగులేనిదే అనుకో! కానీ యీ 'ఉప్మా' మరింత రుచిగా వున్నట్టు నా నాలిక పసిగట్టింది. రెండు ఉప్మాలకీ తేడా ఏమిటీ?" తెల్లని మేఘం మీద నల్లచుక్కల్లాగా వున్న పోపుగింజలనీ, వెన్నమీద ఆకుపచ్చ ఆకుల్లా మెరుస్తున్న పచ్చిమిరప + కరేపాకు తుంపుల్నీ చూసి, ఆ ఉప్మాని ఎర్రగా మెరిసే అల్లం చెట్నీతోనున్నూ, తెల్లగా అక్కడక్కడా ఎండుమిరప (వేయించినవి) + పోపుతో నోరూరిస్తున్న కొబ్బరి చెట్నీతోటి కలిపినంచుకు తింటూ అడిగాను.

"ఉప్మా క్వాంటిటీ ఎంత పెరిగితే అంత రుచివస్తుందే!" అన్నాడు మా నాన్న. ఆ వుప్మా నిండా జీడిపప్పులే! అంతేగాక మాంఛి 'గజ' నిమ్మకాయలు పిండారేమో.! మహారుచిగా వుంది.

"ఇంకొంచెం ఉప్మా వడ్డించమంటారా పాపగారూ?" మహదానందంగా నా దగ్గరికొచ్చి అడిగాడు వడ్డన బ్రాహ్మడు.

అసలు 'వినాలనే' మా నాన్నని ఆ ప్రశ్న అడిగానని ఆయనకి తెలీనే తెలీదుగదా! అదీగాక వండిన వంటల్ని మెచ్చుకుంటే వంట బ్రాహ్మలు చాలా సంతోషపడతారు గదా!

"వద్దండీ. ఉప్మా చాలాబాగుంది!. మీరు ఇలా అందర్నీ అడిగి వడ్డించడం ఇంకా బాగుంది. మీరు అడిగినందుకైనా మరి కొంచెం ఉప్మా వేయించుకోకపోతే ఏం బాగుంటుందీ? జీడిపప్పులు మాత్రం ఇంకొంచెం ఎక్కువెయ్యండి. అలాగే చెట్నీలు కూడానూ!" బిడియపడుతున్నట్టుగా నటించి అన్నాను.

నాన్న నవ్వాపుకుంటున్నాడని నాకు తెలుసు.

మనకి తిండి దగ్గర మొహమాటం లేదు. ఉంటే, కాశీలో వెలసిన అన్నపూర్ణమ్మ, విశాలాక్షీ నొచ్చుకోరూ!

రెండో రౌండ్‌లో పాపం ఆ బ్రాహ్మడు వెతికి వెతికి మరీ గుప్పెడు జీడిపప్పు ఉప్మాతో జోడించటంతో, పొట్ట బ్రహ్మాండంగా శాంతించింది. ఇహ మధ్యాహ్నం వరకూ తిరుగులేదుగనక, అటు ఆడ, ఇటు మగ పెళ్ళివారి విడుదుల్లోకి గిలక్కాయలా తెగ తిరిగేశా.

ఇక్కడా అక్కడా మంగళస్నానాలు. గౌరీపూజ సరస్వతీపూజలు... కన్యావరణాలు.. మధుపర్కాలు, యజ్ఞోపవీతధారణ, సంకల్పం, ఇవన్నీ చాలా జాగ్రత్తగా గమనించా. (మనం, పెళ్ళిచేసుకునేటప్పుడు ఇవన్నీ చెయ్యాలి కదా! చూసి పెట్టుకుంటే టెన్షను ఉండదుకదా!)

"మనం కూడా తొందరగా పెళ్ళి చేసుకుందామే సీతా.. చూడు.. ఎన్ని కొత్తబట్టలూ నగలో!" ఉత్సాహంగా అన్నది ఏలేశ్వరపువారి మనవరాలు. అది నాకంటే పెద్దది. ప్రతీక్లాసూ రెండు సార్లు చదివి బలమైన పునాది వేసుకుంది. నివషానికోసారి ముక్కు చీదుతూవుంటుంది.

"ఏం లాభం? అన్నిటికీ ముక్కుచీమిడి అంటిస్తావుగా!" అన్నా.

"ఛీ! నీతో మాటాడటం నాదే బుద్ధి తక్కువ!" నెత్తిమీద కొట్టుకుని ముక్కు చీదింది అది.

పుట్టాక నేను చూసిన మొదటి పెళ్ళిమండపం అదే గనక, దాన్ని వర్ణించకపోతే ఏం బాగుంటుంది? పచ్చని మావిడితోరణాలు, నిలువుగా మల్లెదండలు, సీతమ్మ వారి జడబంతి పూలదండలు, ముద్దబంతిదండలు ఇవన్నీ అట్టహాసంగా కట్టారు. మరువం దమనం దండలు వేలాడదీశారు గనక ఒకటే సువాసన. అందరిమీదా అత్తరు బుడ్లతో అత్తరు జల్లారు గనక, మండపం మొత్తం పూలసువాసనలతో పూలతోటలా పరిమళించింది. తలంబ్రాలు పసుపచ్చగా కొన్నీ! ఎరుపువి కొన్నీ! వాటిల్లో. 'నిజం ముత్యాలు' కొన్ని ధగధగా మెరుస్తున్నై.

ఇక మా పెళ్ళికూతురు రెండో సీత అయితే అప్సరసలా మెరిసిపోతోంది. ఎన్ని నగలో, వడ్డాణంతో సహా! తెర తీశాక పెళ్ళికొడుకు సీతనీ, సీత పెళ్ళికొడుకునీ ఎన్నిసార్లు చూసుకున్నారో.

తాళిని నేను కూడా తాకాను. మంగళవాద్యాలు మోగుతుండగా బ్రహ్మాండంగా పెళ్ళి జరిగింది. ఆ మధుపర్కాలతో, వాళ్ళు తలంబ్రాలు పోసుకునేటప్పుడు చూడ్డానికి రెండు కళ్ళు చాలలేదు. ఆ తరవాత హోమం - పాణిగ్రహణం సప్తపదీ అవన్నీ యధాప్రకారం జరిగినై.

అన్ని 'తంతు'ల గురించీ చెబుదామని వున్నదికానీ, మీ సమయాన్ని వృధా చెయ్యకూడదుగదా!

పగలే బ్రాహ్మడు 'ఆరుంధతీ' నక్షత్రాన్ని చూడమని ఓ వైపుకి చూపించాడు.

"పట్టపగలు చుక్కలు చూపించటం" అన్నమాట తంతులోంచే పుట్టుకొచ్చిందేమో!

ఆ తరవాత స్థాళీపాకం, సదస్యం, కంకణ విమోచనం, శేష హోమం, నాకబలి జరిగింది.

ఉంగరాలు తియ్యడం, బువ్వా బంతులు, అలకపాన్పు వంటి వేడుకలు రాత్రిపొద్దుబోయేదాకా జరుగుతూనే వున్నై.

పెళ్ళిభోజనం బ్రహ్మాండం. కరణంగారి రైతులూ, మా వూరి వాళ్ళూ, సీతారామపురం వాళ్ళూ, పెళ్ళికొడుకు ఊరివాళ్ళూ, చుట్టాలూ పక్కాలూ బంధువులే వెయ్యిమందికి పైన వచ్చారు. అదిగాక కుటుంబాలతో చాకలివాళ్ళు మంగలివాళ్ళూ కుమ్మరివారూ పద్మసాలీవారూ వారందరికీ కూడా సమానంగా విందుభోజనం వేరే పేద్దపాకలో విడివిడిగా ఏర్పాటు చేశారు. పాలేళ్ళకీ వారి కుటుంబాల్లో వున్న అందరికీ బట్టలు పెట్టి తాంబూలాలిచ్చారు. లడ్లూ అరిసెలూ జంతికలూ పంచదార చిలకలూ ఇవన్నీ అందరికీ అందమైన చిన్న తాటాకు బుట్టల్లో పెట్టి ఇచ్చారు.

రాత్రి ఎనిమిదికి అప్పగింతలు... భోజనాలు అయ్యాక అందరూ ఏడ్చేశారు. నాకు తెలీకుండానే ఏడుపొచ్చింది. వెక్కెక్కి ఏడుస్తూ "మళ్ళీ ఎప్పుడొస్తావే!" అంటూ దాన్ని కావలించుకుని ఏడ్చా. అదీ ఏడ్చి, "యీ బొమ్మ నీకోసమే కొన్నానే! మూడురూపాయలు!" అని నా చేతికిచ్చింది. వెనక్కి వెనక్కి చూస్తూ కారెక్కి అది వెళ్ళగానే నా గుండె 'ఖాళీ' అయిపోయింది.

ఆ బొమ్మని మొహానికి హత్తుకుంటూ బావురుమని ఏడ్చా. "చిన్నిముండా.. పిచ్చిముండా" అని నన్ను తిట్టి, అవే తిట్లు నాచేత తిట్టించుకునే రెండో సీత అవాళ నా మీద చూపించిన ప్రేమ ఏలా మర్చిపోగల్ను! "దీని ఖరీదు మూడురూపాయలు" అన్నదాని మాట ఇప్పటికీ నా చెవుల్లో వినిపిస్తూనే ఉంటుంది.

తెల్లవారుఝామునే లేచి మళ్ళీ బళ్ళమీద మా వూరొచ్చేసరికి పూర్తిగా తెల్లారింది. మనసునిండా ఏదో వెలితి. అమ్మానాన్నా కూడా నిశ్శబ్ధంగానే వున్నారు.

"ఏంటి నాన్నా.. నిద్రపట్టలేదా?" అన్నాను. నాకైతే తెల్లార్లూ నిద్రపట్టలా.

"ఎప్పుడో ఒకప్పుడు నువ్వూ పెళ్ళిచేసుకుని వెళ్ళిపోతే మేమెట్టా బతికేదే సీతా?" అంటూ మా నాన్న నన్ను కావలించుకుని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. మా అమ్మ అంతే. "నేనసలు పెళ్ళే చేసుకోను.. మీ దగ్గరే వుంటా!" నిద్రమత్తులో వాళ్ళని కావలించుకుని అన్నాను. నేను నిద్రలేచేటప్పటికి పగలు పదిన్నర దాటింది.

మూడోరోజున రెండో సీతా వాళ్ళాయనా, ఆయన పిన్నీ, ఆయన పెదనాన్న కూతురు వచ్చారు. మళ్ళీ దాన్ని చూడంగానే నా ప్రాణం లేచొచ్చింది. అదీ సంతోషంగా నన్ను దగ్గరకూర్చోబెట్టుకుని, "మా అత్తారింట్లో ఓ నిలువుటద్దం వుందే సీతా, నాకంటే పొడుగుంది.. దాని ఖరీదు రెండువందల ఎనభై రూపాయలుట. అవునే, మొన్న గౌరీపూజకి కట్టుకున్న పట్టుచీర ఎంతో తెలుసుటే? మూడువందల అరవై అయిదూ. ఆ కంచి నించి ప్రత్యేకంగా తెప్పించారుట. అబ్బ.. మా అత్తారింట్లో బాత్‌రూములున్నాయీ; చాలా పెద్దవనుకో.. అన్నట్టు ఒసేవ్ అక్కడ కరెంటు దీపాలూ పంఖాలూ వున్నాయే!" అంటూ బోల్డంత 'చెత్త' వినిపించినా, అదివరకట్లాగా నాకు చికాకు పుట్టలా. సాయంకాలం చీకటిపడుతోంది. ఇంతలోకే హడావిడిగా వాళ్ళమ్మ వచ్చి,

"ఒసే సీతా... ఖబుర్లు చాలుగానీ మీ యింటికి పద!" అన్నది.

"కాసేపు దాన్ని నాతో వుండనీవే అమ్మా!" అన్నది రెండో సీత."

"నీ మొహం! అవతల పెళ్ళికొడుకు తరఫువారు తొందరపెడుతున్నారు. లేచిరా." అన్నది.

"తొందరెందుకూ.. ఇంకా దీపాలు పెట్టలేదుగా భోజనానికి?" ఆరిందాలా అన్నా.

ఆ రోజుల్లో 'గూట్లో దీపం - నోట్లో ముద్ద' సిస్టమ్ ఫాలో అయ్యేవారు ఏడున్నరా ఎనిమిదింటికల్లా ఊరు ఊరంతా నిద్రలో మునిగేది.

"తొందరెందుకా? శోభనానికి. నువు ముందరలేచి మీ ఇంటికిపో, లేకపోతే ఇది లేవదు.!" చికాగ్గా నన్ను చూసి అన్నది కరణంగారి భార్య.

"శోభనమంటే ఏమిటీ?" అడిగాను. తెలియని విషయాలు అడిగి మరీ తెలుసుకోవాలిగదా!

"పోయి మీ అమ్మనడుగు.. తీరిగ్గా చెబుతుంది." అంటూ నా చెయ్యి పట్టుకుని గుమ్మందాకా లాక్కొచ్చింది.

"పోవమ్మా పుల్లమ్మా.. నువు చెప్పకపోతే నేను కనుక్కోలేనా?" అంటూ చెయ్యి విదిలించుకుని మా యింటికొచ్చా.

"అవునే అమ్మా..., ఇంతకీ శోభనం అంటే ఏమిటీ? పెళ్ళికొడుకు వాళ్ళు తొందరపడుతున్నారట!" మా అమ్మని అడిగాను. మా నాన్నా అక్కడే వున్నాడు వాళ్ళిద్దరూ ఒకర్ని చూసి ఒకరు నవ్వుకున్నారుగానీ, అసలు విషయం చెప్పలా.

మరుసటి రోజు పొద్దున్నే రెండో సీత ఇంటికి పోయా. అది నవ్వింది. దాన్ని చూడగానే అనిపించింది... యీ సీత నాకు తెలిసిన సీత కాదని. ఏదో చెప్పలేని మార్పు. ఏదో పెద్దరికం.. ఏదో హుందాతనం... మనిషి మొత్తం మారిపోయింది. నేనేం మాట్లాడాలో తెలియక నిలబడి పోయా. ఓ క్షణం తరవాత 'వెళ్ళొస్తానే' అంటూ మా యింటికి తిరిగొచ్చేశా. ఉండమని అదీ అనలేదుగానీ, చిన్నగా అందంగా మళ్ళీ నవ్వింది.

అటూ ఇటూ తిరుగుతూ, వాళ్ళ గేటులోంచి చూస్తూ రెండో సీతని గమనించా. వెళ్ళాలని గాఢంగా అనిపించినా, వెళ్ళలేకపోయా. అంతకు ముందుండే 'చనువు'గా నేను మాట్లాడలేకపోయా. అది సడన్‌గా పెద్దవాళ్ళతో కలసిపోయినట్టు అనిపించింది.

"ఎందుకే అమ్మా సీతని చూస్తే అదివరకులాగా అనిపించలేదూ?" అని కూడా మా అమ్మనడిగా.

"ఆడవాళ్ళు పెళ్ళవంగానే ఇట్టే ఎదిగిపోతారే! రేపు నువ్వైనా" అంది తేలిగ్గా.

రెండో సీత అత్తారింటికెళ్ళిపోయింది. వెళ్ళేటప్పుడు వాళ్ళ వాళ్ళంతా 'శోకాలు' పెట్టినా అది మాత్రం 'ఖుషీ'గానే వాళ్ళాయనతో వెళ్ళిందని నాకు అనిపించింది. ఏడుపూ నవ్వూ కాని మొహం పెడితే ఏమనుకోవాలీ? "బాగాచదువుకోవే!" అని మాత్రం నాతో అన్నది.

స్కూళ్ళు తెరవడానికి ఇంకా టైముంది. లైబ్రరీకి పోయి కూచున్నా. ఆచార్యులుగారు నన్ను చూడగానే "ఎక్కడికెళ్ళావమ్మాయ్?" అనడిగారు. పెళ్ళి విషయాలన్నీ పూసగుచ్చినట్టు చెప్పాను. సీతలో మార్పు గురించి కూడా చెప్పాను. ఆయన నా తల నిమిరి, "అవన్నీ ఆలోచించకూడదు. ఇదిగో యీ కథలు చదువు.. చాలా చాలా బాగుంటాయి!" అని 'కొడవటిగంటి' వారి కథల పుస్తకం ఇచ్చారు. అక్కడే మొదలెట్టా. రెండు మూడు కథలు చదివాక, "ఇదిరా కథంటే!" అనిపించింది. అంత చక్కగా అంత సులువుగా కథలు రాయడం ఆయనకే చెల్లింది. మెల్లమెల్లగా బుచ్చిబాబు, గోపీచంద్, ఇలా ఒక్కొక్క మహారచయితనీ నాకు పరిచయం చేశారు ఆచార్యులుగారు.

ఆ రోజుల్లో అందరి ఇళ్ళల్లోనూ 'కరెంటు' వుండేదికాదు. బాగా 'వున్న'వాళ్ళు కరెంటు పెట్టించుకునేవాళ్ళు. సాయంకాలం అవంగానే లాంతరుగ్లాసుల్ని తుడిచి లాంతర్లు వెలిగించేవారు. లెస్టర్‌లాంపులని కూడా ఉండేవి. అవిగాక బెడ్‌రూమ్ లాంప్స్. వాటికీ దీపపు బుడ్లనీ, గుడ్డిదీపాలనీ అనేవాళ్ళు. ఇంకా కరెంటు స్తంభాలు అన్ని చోట్లా పాతలేదు గనక వీధిదీపాలుండేవి. ఓ చిన్న నిచ్చెన ఓ డబ్బాతో కిరసనాయిలూ ఓ చిన్న కత్తెర, జేబుల్లో అగ్గిపెట్టె వత్తులతో 'సాంబయ్య' సాయంకాలం అయిదుగంటలకి రోడ్డుమీద కొచ్చేవాడు.

అతనివెనకాల మేము. నాలుగుపలకల దీపపు సెమ్మెలు వుండేవి. నాలుగువైపులకీ కాంతి వొచ్చేట్టుగా గ్లాసుపలకలు.

ముందుగా ఆ గ్లాసుల్ని తుడిచి, బుడ్డిలో కిరసనాయిలు గొట్టంతో నింపి కాలిపోయిన భాగాన్ని (అంటే వొత్తిభాగాన్ని) కత్తెరతో నీటుగా కత్తిరించి, దీపం వెలిగించి పలక మూసి నిచ్చెనమీంచి దిగేవాడు సాంబయ్య. అతని ఉద్యోగం అదే అందుకే అతన్ని దీపాల సాంబయ్య అనేవాళ్ళం.

నాకు బాగా జ్ఞాపకం... థర్డ్‌ఫాంలో చేరిన మొదటిరోజుల్లోనే, లాంతరు వెలుగులో జ్యూల్స్ వెర్న్ రాసిన 'సముద్రగర్భంలో సాహసయాత్ర' చదివింది. సముద్రము, సముద్రజీవులూ.. ఓహ్.. ఏమా ఊహాలోకం... కలల్లో కూడా కనిపించేవి. అలాగే కౌంట్ ఆఫ్ మాంటిక్రిస్టో, భయస్తుడు, ఘంటారావం, పతితలాంటి అనువాదపు నవలలు చదివింది థర్డ్ ఫాంలోనే.

ఫస్టు క్వార్టర్లీలో నాకు అన్ని సబ్జక్టుల్లోనూ చాలా తక్కువ మార్కులు అంటే, 60కి లోపే వచ్చాయి.

"నీకు చదువెందుకే? ఇరవైనాలుగ్గంటలూ ఆ వెధవ నవల్సు చదువుతూ వుండు. ఎట్టాగూ ఫెయిలౌతావు. అంత భాగ్యానికి ఫీజులెందుకూ కట్టడం.!" అని నిష్టూరాలాడింది మా అమ్మ.

"నోరుముయ్యవే... అది చదివే పుస్తకాలు బియ్యే చదివే వాడుకూడా చదవలేడు. మార్కుల్లో ఏముందీ? అయినా అది ఏభై కంటే ఎక్కువే తెచ్చుకుందిగా! నీ మానాన నువ్వుండు. దాన్ని అనవసరంగా డిస్టర్బు చెయ్యకు!" అని మా నాన్న నాకు వత్తాసు పలికాడు. వింటున్నారా నేటి తల్లిదండ్రులారా?

(మళ్ళీ కలుద్దాం)

Post your comments